ప్రజాశక్తి

శుక్రవారం 21 జులై 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ఉమ్మడి ప్రకాశం జిల్లాను

గుండెల్లో పెట్టుకొని అభివృద్ధి చేస్తా ..

- వేధింపులకు పాల్పడిన వైసిపి నాయకులను వదిలిపెట్టేది లేదు
- ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు ఉగ్ర
- వలస వచ్చిన మధుసూదన్ అవినీతి మనీసూదన్‌గా మారాడు
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి-కనిగిరి

టిడిపికి నలుగురు ఎమ్మెల్యేలను ఇచ్చిన ఉమ్మడి ప్రకాశం జిల్లాను గుండెల్లో పెట్టుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ తెలిపారు. కనిగిరి పట్టణం లోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు. కందుకూరు అదిరిపోయింది, కొండపి దద్దరిల్లింది, కనిగిరి ప్రభంజనంగా మారిందని, కాటమరాజు పాలించిన బంగారు కొండ ,పోరాటాల గడ్డ కనిగిరి అని తెలిపారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న కనిగిరి గడ్డలో పాదయాత్ర చేయటం తన అదృష్టమన్నారు. యువగళం మనగళం ప్రజాబలమన్నారు. యువగళమంటే జగన్‌కు భయమని తెలిపారు. తనను అడ్డుకోమని పోలీసులను పంపాడు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పట్టుకొని నడిచిన తనను



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్



వర్షంలోనూ పాదయాత్ర కొనసాగిస్తున్న నారా లోకేష్



మాట్లాడుతున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

అడ్డుకొనే దమ్ము ఎవరికైనా ఉందా అని ఆయన ప్రశ్నిం చారు. తన పాదయాత్రకు ఐప్యాక్ టీంను పంపిస్తే టిడిపి కార్యకర్తలు పట్టేశారన్నారు. యువగళం మొత్తం లైవ్‌లో వస్తుందని, సైకో జగన్ ఐప్యాక్ ఇక్కడికి వచ్చి ఏం పీకుతుం దన్నారు. ప్రకాశం జిల్లాలో యవగళం ప్రభంజనంలా సాగు తుందన్నారు. అడ్డు కోవడాన్ని అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. టిడిపి కార్యకర్తలు కనిగిరి సభకి ఆటోలో వస్తుంటే ఒక్కో ఆటోకి రూ 20వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఒక్కరు కూడా రూపాయి కట్టవద్దని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదొంగ చలానాలను రద్దు చేస్తామన్నారు. బెంగుళూరు ,హైదరబాదు,ఇడుపులపాయ, వైజాగ్, తాడేపల్లిలో ప్యాలెస్‌లు ఉన్న జగన్ ఎలా పేదవాడన్నారు. సిమెంట్ కంపెనీలు , పవర్‌ప్లాంట్‌లు, సొంతటీవీ చానల్ ఉన్నప్పటికీ పేదవాడినని చెప్పి ప్రజలను మోసం చేస్తాడన్నాడు.

విద్యుత్ చార్జీలు తొమ్మిసార్లు బాదుడే బాదుడు, ఆర్టీసీ ఛార్జీలు మూడుసార్లు బాదుడే బాదుడు, ఇంటిపన్ను బాదుడే బాదుడు, చెత్తపన్ను బాదుడేబాదుడని, చెత్తపన్ను,ని త్యావసర సరకుల ధరలు బాదుడే బాదుడన్నారు. కిలో టమాటా , పచ్చిమిర్చి ధర సెంచరీ దాటిందన్నారు. జగన్ మహిళలను నమ్మించి మోసం చేశారన్నారు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేసి ఓట్లు అడుగుతానని చెప్పి ఇప్పుడు ▶ 3లో



కొత్తపేటలో నిర్మాణం పూర్తికాని సచివాలయ భవనం

నత్తనడకన భవన నిర్మాణాలు

రద్దు కానున్న 675 కట్టడాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టారు. వాటి నిర్మాణాలు రెండేళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు భవనాల నిర్మాణాలు తమ వల్ల కాదని చేతులెత్తేశారు. దీంతో అవి అసంపూర్తిగా నిలిచి పోయాయి. పునాది దశలో ఉన్న భవనాలను ప్రభుత్వ లెక్కల నుంచి తొలగిస్తున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన రాష్ట ప్రభుత్వం రెండేళ్లుగా క్రితం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భారీ ఎత్తున సచివాలయాల వారీగా ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. వైసిపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఈ పనులకు శ్రీకారం చుట్టింది. అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు భవనాల నిర్మాణానికి పూనుకున్నారు. తమ వద్ద ఉన్న సొమ్ముతో పాటు వడ్డీకి ▶ 3లో

సాగర్ నీటిని విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజల తాగునీటి అవసరాల కోసం సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో తీర్మానాలను సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పత్రికలకు విడుదల చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లాలో ప్రజల తాగునీటి అవసరాలకు రామతీర్థం తో పాటు 28 మంచినీటి పథకాలు ఉన్నాయని, గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిధిలో 34 చెరువులు, సాగర్ కాలువ కింద 98 చెరువులకు జూన్ నెల చివరకు సాగర్ నీరు వదలాల్సి ఉందన్నారు. మంచినీటి పథకాలన్నీ అడుగంటి పోయాయని, సాగర్ నీటిపై ఆధారపడిన స్కీమ్‌లు, చెరువుల ద్వారా మంచినీరు పొందే ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడుతుందన్నారు. జిల్లా మంత్రులు, అధికారులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం నుండి స్పందన రావడం లేదని, ప్రజల మంచినీటి సమస్య పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని సిపిఎం నిరసిస్తుందన్నారు. తక్షణమే తాగు, సాగునీటి అవసరాల కోసం సాగర్ నీటిని విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి.సోమయ్య, ఉసా వెంకటేశ్వర్లు, వి. ఆంజనేయులు పాల్గొన్నారు.



బాధితుడు నవీన్‌ను పరామర్శిస్తున్న ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్

నవీన్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

- దాడి చేసిన వారికి శిక్ష పడేలా చర్యలు
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎస్‌టి కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో దాడికి గురైన గిరిజనుడు మోటా నవీన్‌కు, అతని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ అన్ని విధాల అండగా ఉంటుందని ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. బాధితుడు, అతని కుటుంబ సభ్యులను గురు వారం పరామర్శించారు. నవీన్‌పై దాడికి పాల్పడిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఒంగోలు వచ్చిన వడిత్యా శంకర్ నాయక్‌ను ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జిల్లా ఎస్‌పి మలికా గర్గ్ కలిసి ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. ఎఫ్ఐఆర్ సెక్షన్ 307 నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కూడా రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడికి పాల్పడిన 9 మందిలో ఆరుగురిని ఇప్పటికే అరెస్ట్ చేశామని, మిగతా ముగ్గురిని అదుపులోకి తీసుకోవడానికి ప్రత్యేక బందాలు ఏర్పాటు చేశామని ఎస్‌పి వివరించారు. త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేసి చార్జిషీటు దాఖలు చేస్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టంలో బాధితునికి పరిహారం త్వరగా వచ్చేలా చూస్తామని కమిషన్ సభ్యుని దష్టికి తీసుకువెళ్లారు. బాధితుడిని పరామర్శించిన అనంతరం కమిషన్ సభ్యులు ▶ 3లో

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం 4,5 వ తరగతి విద్యార్థులకు అమ్మ చారిటీస్ ద్వారా చేతిరాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయిన మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు చక్కని చేతిరాత నేర్పించడానికి, అలాగే వారి సామర్థ్యం పెంచడానికి అమ్మా చారిటీస్ కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని చేతిరాతను మెరుగుపరుచుకోవాలని ఆయన కోరారు. పుస్తకాల పంపిణీకి సహకారం అందించిన వెల్లలచెరువు గ్రామానికి చెందిన డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ, తన సొంత గ్రామమైన వెల్లలచెరువులో చదువుకునే చిన్నారి విద్యార్థులకు అమ్మా చారిటీస్ ద్వారా చేతిరాత పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందన్నారు. రాబోయే రోజులలో చిన్నారి విద్యార్థుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. అమ్మ చారిటీస్ కన్వీనర్ జర్నలిస్టు శేషగిరి నాయుడు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు చక్కని చేతిరాత నేర్పించడానికి తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారా బాలయ్య, అమ్మ చారిటీస్ ప్రతినిధి రామ్మోహన్, ఉపాధ్యాయులు ముస్తఫా పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పంగులూరు

వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైర్లను దొంగలు దోచుకెళుతున్నారు. సోలార్ పంప్ సెట్లకు సంబంధించి అందులో ఉండే ముఖ్యమైన భాగాలను కూడా దొంగలు దోచుకెళుతున్నారు. అయినా అటు పోలీసు అధికారులు కానీ, ఇటు విద్యుత్ శాఖ అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై పంటలు సాగు చేసుకుంటున్న ప్రస్తుత సమయంలో, దొంగతనాల వలన కరెంటు లేక, మోటార్లు పనిచేయక, నీటి సౌకర్యం లేక, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులకు, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. పంగులూరు మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సోలార్ పంపుసెట్ల పరికరాల దొంగతనాలు ఈ మధ్యకాలంలో విపరీతంగా పెరిగిపోయాయి. రాత్రి సమయాల్లో పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి, అందులో ఉండే రాగి వైరును తీసుకువెళుతున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో 20 నుంచి 30 కిలోల వరకు రాగి వైరు ఉంటుంది. కిలో 800 నుంచి 900 రూపాయల వరకు ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే రాగి వైరును దొంగలు దోచుకెళ్లి బయట వ్యక్తులకు అమ్ముతున్నారని రైతులు అంటున్నారు. సోలార్ పంప్‌సెట్లకు సంబంధించి కూడా దొంగతనాలు ఈ కాలంలో ఎక్కువయ్యాయి. మండలంలో సుమారు 25 సోలార్ పంపుసెట్ల వరకు దొంగతనాలకు గురయ్యాయి. ఈ దొంగతనాలకు సంబంధించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా కూడా ఇంతవరకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ గానీ, ఒక సోలార్ పంప్ సెట్ పరికరాలు గాని దొంగలను పట్టుకుని రికవరీ చేసిన సందర్భాలు లేవని రైతులు చెబుతున్నారు. ఈ సంవత్సర కాలంలోనే మండలంలో మొత్తం 12 ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగ చోరీకి గురైంది. అందులో ఒక్క దొంగను కూడా పట్టుకున్న దాఖలాలు లేవు. ఈ దొంగతనాలకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు పోలీస్ స్టేషన్లో కేసు పెట్టుకున్న నాలుగు కేసులు సంబంధించి మాత్రమే పోలీసులు ఎఫ్ఐఆర్ రాసి అధికారులకు పంపారు. ఇంకా ఎనిమిది కేసులకు సంబంధించి విద్యుత్ అధికారులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన పోలీసులు ఎఫ్ఐఆర్ రాయలేదని అన్నారు. ఎఫ్ఐఆర్ రాసి విద్యుత్ అధికారులకు అందజేస్తే, వాటి ద్వారా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అయినా పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నాలుగు నెలల క్రితం జరిగిన కేసులకు కూడా ఇంతవరకు ఎఫ్ఐఆర్ తయారు చేయలేదని తెలిసింది. పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యుత్ అధికారులు కూడా బాధ్యతగా ఎఫ్ఐఆర్‌లు తెప్పించుకునే పరిస్థితి ఇక్కడ కనబడటం లేదు. తాజాగా అలవలపాడు గ్రామంలో వారం రోజుల క్రితం ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు దొంగతనానికి గురయింది. విద్యుత్ అధికారులు వారం రోజులు క్రితం రేణింగవరం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎఫ్ఐఆర్ రాయలేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద ఐదుగురు రైతులకు చెందిన 13 ఎకరాల భూమి సాగవుతుంది. ఈ భూమిలో ప్రస్తుతం రైతులు మిర్చి పంటను సాగు చేశారు. మొక్కలు వేసి వారం రోజులు అవుతున్నా ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక, నీళ్లు రాక, మొక్కలు ఎండిపోయే దశకు వచ్చాయి. అధికారులు ఇప్పటికైనా త్వరగా ఎఫ్ఐఆర్ పూర్తి చేసి రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేయాలని, తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



రాగి వైరును దొంగలు దోచుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గిద్దలూరు

స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో 'బుధవారం రాత్రి ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో వ్యక్తి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి నరవ బయనపల్లి గ్రామానికి చెందిన శివ గా రైల్వే పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలానికి రైల్వే పోలీసులు జి జయరాములు, ఇతర సిబ్బంది చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాను



కరణం వెంకటేష్‌ను సన్మానిస్తున్న డాక్టర్ బాబూరావు, అసోసియేషన్ సభ్యులు

వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-చీరాల: ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సేవ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆపదలో ఉన్న వారి అవసరాలను గుర్తించి చేయూతను అందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సేవలను ఆయన ప్రసంశించారు అనంతరం తోటవారిపాలెం వీవర్స్ కాలనీకి చెందిన పేద వికలాంగుడైన పొట్టేటి సాయికి జైపూర్ పాదాలు విజయవాడలో పెట్టించు కొనేందుకు డాక్టర్ బాబూరావు రూ.5,000, వాకర్స్ అసోసియేషన్ రూ.15,000 మొత్తం కలిపి రూ.20,000 కరణం వెంకటేష్ చేతుల మీదుగా అందజేశారు. పేదలకు సహాయం చేయడంలో రోటరీ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ ముందంజలో ఉన్నాయని కరణం వెంకటేష్ బాబు అన్నారు. కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, డాక్టర్ బాబూరావు, వలివేటి మురళీకృష్ణ, పార్వతి, సుభాషిణి, చీమకుర్తి బాలకృష్ణ, చారుగుళ్ల ప్రసాద్, రవిచంద్ర, డివి సురేష్, శీరాం రమేష్, చింతా రమేష్, వాకర్స్, రోటరీ, ఇన్నర్ వీల్ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నత్తనడకన భవన నిర్మాణాలు

(మొదటిపేజీ తరువాయి)

అప్పులు తెచ్చి నిర్మాణాలు ప్రారంభించారు. కొందరు పునాదుల నుంచి బేస్‌మెంట్ వరకు పనులు చేశారు. కొందరు పూర్తిగా గోడల వరకు నిర్మాణాలు చేశారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు శ్లాబులు కూడా వేశారు. కాని బిల్లుల మంజూరులో జాప్యం చోటు చేసుకుంది.ఒక్కొక్కరూ రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు భవన నిర్మాణాలకు ఖర్చు చేశారు. అయితే బిల్లులు అరకొగానే వచ్చాయి. గత ఎప్రిల్ నెల వరకూ భవన నిర్మాణాలకు చేసిన వ్యయంలో సగం బిల్లులు మాత్రమే మంజూరయ్యాయి. బిల్లు వచ్చాక పనులు చేద్దామని అత్యధికులు పనులు నిలిపివేశారు. ఇటీవల బిల్లులు మంజూరు అవుతున్నప్పటికి ఇప్పటికే భవన నిర్మాణాలు చేపట్టి తాము వడ్డికి తెచ్చిన మొత్తాలపై అధిక వడ్డీ పడి నష్టపోయిన వారిని చూసి మిగతా వారు తాము చేపట్టిన భవన నిర్మాణ పనులను మధ్యలోనే వదిలివేశారు. ఏడాది కాలంగా ప్రతి నెల రెండు పర్యాయాలు ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులు త్వరితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు పంచాయితిరాజ్ శాఖ ఉన్నతాధికారులు సమీక్షలు చేస్తూనే ఉన్నారు. జిల్లాలో భవన నిర్మాణాలు ఆశించిన రీతిలో జరగక పోవడానికి ప్రధాన కారణం బిల్లులు సక్రమంగా రాకపోవడమే. ఈ కారణంగా పిల్లర్లు లేపి పునాదిదశలో ఉన్న వాటిని ప్రభుత్వం నిలిపివేసింది.బాపట్ల జిల్లాలో రెండేళ్ళ క్రితం 401 గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు.ఇందుకు రూ 149.29 కోట్ల నిధులతో అంచనాలు రూపొందించారు. ఇప్పటివరకు 155 భవన నిర్మాణాలు పూర్తి కాగా 84 భవనాలను అప్పజెప్పారు.మిగతావి వివిధ దశల్లో ఉండగా పనులు ప్రారంభం కాని 102 భవనాలను లెక్కలోంచి తొలగించారు. రైతు భరోసా కేంద్రాలు 315 మంజూరు కాగా వాటి కోసం రూ 69.53 కోట్లను మంజూరు చేశారు. 75 భవన నిర్మాణాలు పూర్తి కాగా 42 అప్పజెప్పారు.పనులు ప్రారంభ కాని 165 భవనాలను లెక్కల్లోంచి పక్కన పెట్టారు. జిల్లాలో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలు 343 మంజూరయ్యాయి. ఇందుకోసం రూ 60.65 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇందులో 55 భవనాలు పూర్తయ్యాయి. 176 ఆరోగ్య కేంద్ర భవనాలు పలు దశల్లో ఉన్నాయి. పనులు ప్రారంభం కాని 112 భవనాలను పక్కనపెట్టారు. జిల్లాలో రూ 25.80 కోట్ల అంచనాలతో 136 పాల సేకరణ కేంద్ర భవనాలు (బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్)మంజూరు అయ్యాయి.వీటిలో 44 భవనాల నిర్మాణాలు ప్రభుత్వ నిధులతో నిర్మించాల్సి ఉంది.మరో 99 భవనాలను అమూల్ సంస్థ నిర్మించాల్సి ఉంది.

నవీన్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

శంకర్ నాయక్ మాట్లాడుతూ గత నెల 19న ఒంగోలులో గిరిజన యువకుడిపై దాడి. కులం పేరుతో దూషిస్తూ మూత్రం పోసిన అమానవీయ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. ఇది ఒక యువకునిపై జరిగిన దాడిగా మాత్రమే కాకుండా రాష్ట్రంలోని మొత్తం 40 లక్షల మంది గిరిజన సమాజాన్ని అవహేళన చేస్తూ జరిగిన దాడిగా ఎస్‌టి కమిషన్ చూస్తోందన్నారు. నవీన్ పట్ల అమానవీయంగా ప్రవర్తించిన మన్నె రామాంజనేయ చౌదరి, మరో 8 మందికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి, డిఐజిని ఆదేశించామన్నారు. సోషల్ మీడియాలో ఈ దాడికి సంబంధించిన వీడియోను ఇటీవల గమనించిన సిఐ, డిఎస్‌పి వెంటనే జిల్లా ఎస్‌పి దృష్టికి తీసుకువెళ్లడంతో పోలీసు యంత్రాంగం వేగంగా స్పందించి ఆరుగురిని అరెస్ట్ చేశారన్నారు. మిగతా ముగ్గురిని కూడా త్వరగా అరెస్ట్ చేయాలని ఎస్‌పిని ఆదేశించినట్లు శంకర్ నాయక్ తెలిపారు. బాధితునికి, దాడికి పాల్పడిన వారికి మధ్య గతంలో ఏమైనా విభేదాలు, ఘర్షణలు జరిగితే చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించామన్నారు.

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనిచెప్పారు. ప్రత్యేకంగా ఎస్‌టి కమిషన్‌ను ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. బాధితుడు కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని శంకర్ నాయక్ తెలిపారు. బాధితుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎఎస్‌పి నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, డిఎస్‌పి నారాయణ స్వామి రెడ్డి, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎగుమతులను ప్రోత్సహించాలి: జేడీ

ప్రజాశక్తి-మద్దిపాడు: కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానం ప్రకారం, ఎగుమతులు, దిగుమతులకు సమతుల్యత సాధించేందుకు, మన దేశం నుంచి ఎగుమతులను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, పరిశ్రమల శాఖ జెడి జిఎస్ రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 700 జిల్లాల్లో పరిశ్రమల ఎగుమతులకున్న అవకాశాలపై అధ్యయనం చేసి తొలుత 200 జిల్లాలను ఎంపిక చేసిందని అన్నారు. ఎగుమతులను ప్రోత్సహించేందుకు అవసరమైన సదుపాయాలను కలుగజేస్తుందని జిఎస్ రావు వివరించారు. ప్రకాశం జిల్లాలో గ్రానైట్ ఉత్పత్తులను ఆధారం చేసుకుని, ఎక్స్‌పోర్ట్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎగుమతులను మరింతగా ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వాలకు, పారిశ్రామికవేత్తలకు ఇతోధికంగా మేలు జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సమావేశానికి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఫియో సంస్థ కోఆర్డినేటర్ రఘునాథబాబు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు తమ ఎగుమతులను విస్తరించేందుకు తమ సంస్థ కల్పించిన సదుపాయాలను వివరించారు. సర్టిఫికేషన్, రిజిస్ట్రేషన్, సభ్యత్వం, వీసా సౌకర్యం తదితర అంశాలను మరింత సులభతరం చేసామన్నారు. జిల్లా అధ్యక్షులు ఎన్‌వి సుధాకర్ మాట్లాడుతూ, ప్రస్తుత గ్రానైట్ రంగం జిల్లాలో పారిశ్రామిక వేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. సీనియర్ కన్సల్టెంట్లు ఆశిష్ పట్నాయక్, నరేష్ కుమార్‌లు జిల్లాలో ఎగుమతులకు ఉన్న అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పరిశ్రమల శాఖ డిడి ఎం మధుసూదన్ రెడ్డి, జిల్లా కన్వీనర్ రత్నాకర్, కొమ్మి కృష్ణయ్య, డిక్కీ రాష్ట్ర అధ్యక్షులు ఏ ఆశీర్వాదం, డిపి మెంబర్ వి భక్తవత్సలం హాజరయ్యారు.

చెస్ టోర్నమెంట్ విజేత దీపక్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ఎఫర్ట్ కార్యాలయం ఆవరణలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ గురువారం నిర్వహించారు. ఉత్కంఠభరితంగా సాగిన చెస్ పోటీలలో సంతమాగులూరు, బల్లికురవ, యద్దనపూడి, మార్టూరు మండలాలకు చెందిన 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి బహుమతిని సంతమాగులూరు మండలం విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న వేలమూరి దీపక్ కైవసం చేసుకున్నారు. ద్వితీయ బహుమతిని ఎస్ఎల్ గుడిపాడుకు చెందిన ఎంవి సుబ్బారావు, తృతీయ బహుమతిని మార్టూరుకు చెందిన ఏ ఇమ్మానియేల్ కైవసం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో కోలలపూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కె జస్వంత్ మొదటి బహుమతికి ఎంపికవ్వగా శ్రీరామ్ చరణ్ తేజ తృతీయ బహుమతి, మార్టూరు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి ఐ రాహుల్ కుమార్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ప్రోత్సహక బహుమతిగా వలపర్లకు చెందిన సౌమ్య ఎంపికయ్యింది. న్యాయనిర్ణేతలుగా చీరాలకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు ఏ ఉదయ్ కుమార్, కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామకోటేశ్వరరావు వ్యవహరించారు. గెలుపొందిన విజేతలకు ఎఫర్ట్ ఛైర్మన్ జాష్టి వెంకట మోహనరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు కందిమళ్ల రవిబాబు, కంటి వైద్యనిపుణులు సుబ్రమణ్యేశ్వరరావు, ఈశ్వరప్రసాద్ జాష్టి సాంబయ్య, బసవరాములు, షేక్ ఖాజా రోటరీ సభ్యులు పాల్గొన్నారు.



చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాను గుండెల్లో పెట్టుకొని అభివృద్ధి చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

ఏ మొహం పెట్టుకొని అడుగుతాడో చెప్పాలన్నారు. 2 వేల కిమీ పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసానని, మీ కన్నీరు తుడుస్తానని, భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించామన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్‌లు బిగిస్తే పగలగొట్టాలన్నారు. రాష్ట్రంలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కరువైందన్నారు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తెస్తామన్నారు. ఉద్యోగులు హర్షించేలా ఫిట్‌మెంట్ ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే వెలుగొండ పూర్తిచేసి తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. కనిగిరి ప్రాంత ప్రజలు అనేక ఆశలతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన మధుసూదన్ అవినీతి కేరాఫ్‌గా మనీ సూధన్‌గా మారాన్నారు. భూకబ్జాలు, కమిషన్లు కొట్టేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడన్నారు. అధికారం లోకి వచ్చిన వెంటనే టిడ్కో లబ్ధి దారుల చేత గృహ ప్రవేశం చేయిస్తామన్నారు.

ప్రజల కష్టాలు తెలిసిన మంచి మనసున్న వ్యక్తి డాక్టర్ ఉగ్ర అని తెలిపారు. పదవులతో పనిలేకుండా ప్రజా సంక్షేమం, కనిగిరి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాడన్నారు. డాక్టర్ ఉగ్రను ఆదరించి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పరిశ్రమలు తీసుకొచ్చి కనిగిరిని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



షెడ్డు నెట్ నర్సరీలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి జెన్నమ్మ

నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి జెన్నెమ్మ

ప్రజాశక్తి-అద్దంకి

నర్సరీ యాజమాన్యాల వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు చేయించుకుని లైసెన్సులను పొందాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి జెన్నెమ్మ అన్నారు. గురువారం మండలంలోని చిన్న కొత్తపల్లి, సింగరకొండపాలెంలోని షెడ్ నర్సరీలను ఉద్యాన అధికారి ఎస్ దీప్తితో కలిసి వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన నారు అందించాలని కోరారు. సంబంధిత రసీదులను తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని తెలియజేశారు. లైసెన్సు పొందిన నర్సరీ యాజమానులు మాత్రమే విక్రయాలు చేయాలని, పని సమయంలో నర్సరీకి సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండాలన్నారు. నర్సరీ యాజమాన్య రైతులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు జూలియన్

నవీన్ కేసులో నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-చీరాల

ఒంగోలులో జరిగిన ఘటనలో సోషల్ మీడియా ద్వారా ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన గిరిజన యువకుడు నవీన్‌ను గాయపరిచి అతడిపై మూత్రం పోసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మాచవరపు జూలియన్ డిమాండ్ చేశారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసు వ్యవస్థ దుర్నీతిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం మాల భేరి జాతీయ యువజన అధ్యక్షులు చప్పిడి ప్రియతమ్ ఆధ్వర్యంలో ఎస్జీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, అవమానాలు జరుగుతున్నా జగన్ సమీక్ష సమావేశం నిర్వహించకపోవడం సిగ్గుచేటని అన్నారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీని పెట్టి కంటి తుడుపు చర్యలు చేస్తున్నాడని విమర్శించారు. నవీన్ కేసులో సోషల్ మీడియాలో వైరల్ అయితే తప్ప పోలీసులు స్పందించలేదంటే పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. నవీన్ కేసులో ఆరుగురు దోషులు ఉండగా ముగ్గురిని మాత్రమే అరెస్ట్ చేసి.. ఇంకా ముగ్గురు దొరకలేదు, పరారీలోనే ఉన్నారని చెప్పడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉందని జూలియన్ ఆరోపించారు. ప్రతిపక్షాలపై అట్రాసిటీ కేసులు పెట్టినప్పుడు తక్షణమే జైలుకు పంపించే పోలీసులు సామాన్య దళితులపై జరిగిన దాడులలో నిర్లక్ష్యం వహించడం ఏమి న్యాయమని ప్రశ్నించారు. ఎస్సీ ఎస్టీ కేసులో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ నిందితులను అరెస్ట్ చేయడం లేదని అన్నారు. ఈ రాష్ట్రంలో దాదాపుగా 20 వేల ఎస్సీ ఎస్టీ కేసుల్లో నిందితులను ఇప్పటికీ అరెస్ట్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. జగన్‌కు దళితుల మీద నిజంగా ప్రేమంటే తక్షణమే స్టేట్ మానిటరింగ్ కమిటీ ద్వారా ఎస్పీ, కలెక్టర్ దగ్గర రిపోర్టు తెచ్చుకొని కేసులపై రివ్యూ చేసి నవీన్ మీద జరిగిన దాడులు పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గూడూరు కిషోర్, గరిక మోహన్‌రావు, పెర్లి సురేష్, గేరాబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలు కాని ముఖ్యమంత్రి హామీలు

తహశీల్దారు కార్యాలయం ఎదుట విఆర్ఏల ధర్నా





వీఆర్ఏల ధర్నాలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు, యద్దనపూడిలో విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి-అద్దంకి

రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి దశలవారీగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు నాయకులు జి వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు ఆందోళన శిబిరానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వీఆర్ఏల ప్రధాన డిమాండ్ అయిన పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పని చేస్తున్న వారందరినీ వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులకు విఆర్ఓ, అటెండర్, వాచ్‌మెన్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, డిఏ రికవరీ నిలిపివేసి టిఏతో కూడిన వేతనం అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్స్ పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన చేయాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ ఆందోళన చేపడుతున్నామని అన్నారు. సిఐటియు నాయకులు జి వెంకట్రావు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా జగన్ ప్రభుత్వం అధికారంలో ఉందని, వీఆర్ఏ సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు వీఆర్ఏలు అధికారులకు ప్రభుత్వ పెద్దలకు సమస్య విన్నవించినా ఫలితం శూన్యమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీఆర్ఏలకు ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదన్నారు. వీరికి 21 వేల జీతం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. డిఎలో కూడా కోత విధించిం దని, రికవరీ ఆపాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఏమాత్రం దయ చూపలేదని అన్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో మరో దశ పోరాటం చేయాలని సంఘం నిర్ణయించిందన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం మండల కేంద్రాల్లో దీక్షలు, ఆగస్టు 7, 8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆగస్టు 23, 24 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి దీక్షలు, ఆగస్టు 25న చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం నాయకులు ఎం నరసింహారావు, కె స్వాములు, టి నాగేశ్వరరావు గురవమ్మ, పుట్టియ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామ తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అశోక్, జిల్లా కార్యదర్శి కరీముల్లా, విఆర్ఎలు షామిలి, నజ్మా, మాధవి, దయాకర్, కాసీం వలి, రత్నకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫైరింగ్‌లో నేహారామ్‌శ్రీకి బంగారు పతకం

సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థిని అభినందించిన స్కూల్ యాజమాన్యం, ప్రముఖులు





ఫైరింగ్ కాంపిటీషన్‌లో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్లు, బంగారు పతకం సాధించిన నేహారాంశ్రీని అభినందిస్తున్న కమాండర్ కల్నల్ సునీల్ గౌతమ్

ప్రజాశక్తి-చీరాల

23వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి క్యాడెట్స్‌కు నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఉమెన్స్ ఫైరింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థిని నేహారామ్‌శ్రీ యాదవ్‌ని సెయింట్ ఆన్స్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు, ఎన్‌సిసి సిబ్బంది అభినందించారు. చీరాల సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నేహారామ్‌శ్రీ యాదవ్ ఎన్‌సిసిలో శిక్షణ పొందుతూ, ఎన్‌సిసి క్యాడెట్స్‌కు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫైరింగ్ జూనియర్స్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించి మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లా చీరాల విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్స్‌కు నిర్వహిస్తున్న క్యాంపులో నిర్వహించిన జూనియర్స్ ఫైరింగ్ విభాగంలో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ చదువుతున్న నేహారామ్‌శ్రీ యాదవ్ ప్రథమ స్థానం సాధించడం తన స్కూలుకి గర్వకారణం అని యాజమాన్యం అన్నారు. చీరాలలో నిర్వహిస్తున్న ఫైరింగ్ విభాగంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఒంగోలులో శిక్షణనిచ్చి ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా ఫైరింగ్ పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఢిల్లీలో జరిగే అల్ ఇండియా ఫైరింగ్ పోటీలకు నేహారామ్‌శ్రీ యాదవ్ ఎంపికై విద్య అభ్యసిస్తున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మన పట్టణానికి మంచి పేరు ప్రతిష్టలు తీసికొని రావాలని పలువురు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయసులోనే ఎన్‌సిసిలో అత్యంత ప్రతిభ కనబర్చి ఫైరింగ్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిందని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

28న గ్రీన్ బాపట్ల

జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల మొక్కలు నాటాలి

కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



గ్రీన్ బాపట్ల పేరుతో ఈ నెల 28వ తేదీన జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. గ్రీన్ బాపట్ల కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో విస్తారంగా మొక్కలు నాటి బాపట్లను పచ్చదనం చేయాలని కలెక్టర్ చెప్పారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత పెరుగుతుందని అన్నారు. మొక్కలతో జిల్లాను సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. కాలుష్య రహిత బాపట్ల జిల్లాగా రూపుదిద్దేందుకు అధికారులంతా సహకరించాల న్నారు. రెండు లక్షల మొక్కలు ఒకేరోజు నాటడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వేప, చింత, నేరేడు, మోదుగ, పచ్చ సుంకేసుల, ఎర్ర సుంకేసుల వంటి ఎనిమిది రకాల మొక్కలను అన్ని మండలాలకు చేరవేస్తామన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోనూ ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాలు, రహదారులు, అమృత సరోవర్ కింద అభివృద్ధి చేసిన చెరువుల చుట్టూ మొక్కలు నాటించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, పాఠశాలల్లోని విద్యార్థులు, విద్యాసంస్థలు, వాలంటీర్లను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. ముఖ్యంగా సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపిటిసీలు, జడ్పిటిసిలు, ప్రజాప్రతినిధులందరూ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో డ్వామా పిడి వై శంకర్ నాయక్, జిల్లా అధికారులు, డిఎల్‌డివోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, ఏపీడిలు, ఏపిఓలు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ కోర్సులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్‌సి ద్వారా సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బాపట్ల జిల్లా ఎస్‌సి సంక్షేమ సాధికారత అధికారి జె రాజా దెబోరా గురువారం విలేకరులకు తెలిపారు. సివిల్ సర్వీసెస్ (విశాఖపట్నం), ఎపీఎస్‌సి ద్వారా గ్రూప్-1 (విజయవాడ), గ్రూప్-2 (తిరుపతి) ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ స్టడీ సర్కిల్ ప్రకటించినట్లు ఆమె తెలిపారు. పై పరీక్షలకు శిక్షణ కోసం అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా https://apstdc.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆగస్టు 5వ తేదీ 2023 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ అవకాశాన్ని బాపట్ల జిల్లాలోని అర్హులైన ఎస్‌సి ఎస్‌టి ఇతర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణకు ఆసక్తిగల విద్యార్థుల వార్షిక ఆదాయం ఏడాదికి రూ.6 లక్షల లోపు ఉండాలన్నారు. రాష్ట్ర వాసులైన విద్యార్థులు మాత్రమే అర్హులని రాజాదెబోరా తెలియజేశారు.

కనిగిరిలో పాదయాత్రకు నీరాజనం

ప్రజాశక్తి-కనిగిరి

యువనేత టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కనిగిరిలో జన ప్రభంజనాన్ని తలపించింది. కనిగిరి శివారు శంఖవరం నుంచి ప్రారంభమైన పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హరతులు ఇచ్చి గుమ్మడికాయలతో దిష్టితీశారు. కనిగిరి రహదారులు జాతరను తలపించేలా జనసందోహంతో నిండిపోయాయి. భవనాలపై నిలబడి యువనేతకు ప్రజలు అభివాదంచేస్తూ తమ అభిమానాన్ని చాటారు.


లోకేష్‌కు జై కొడుతున్న జనం


లోకేష్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

ట్రిపుల్‌ఐటి కళాశాల త్వరగా నిర్మించాలని లోకేష్‌కు వినతి

అధికారంలోకి వచ్చిన వెంటనే కనిగిరిలో ట్రిపుల్ ఐటి కళాశాలను నిర్మించాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌కు యువగళం పాదయాత్రలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు లక్ష్మారెడ్డి,పవన్‌కళ్యాణ్,ఇఫ్రాస్ వినతి పత్రం అందజేశారు. కనిగిరి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలని కోరారు. 700 మంది పేద విద్యార్ధులు చదువుకుంటున్న కనిగిరి ఎపి మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని మరమ్మతులు చేపట్టాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని ,విద్యారంగ అభివృద్ధికి కృషిచేస్తానని లోకేష్ వారికి హామీ ఇచ్చారు.

లోకేష్‌ను కలిసిన టకారిపాలెం,దేవాంగనగర్ ప్రజలు

లోకేష్ పాదయాత్ర టకారిపాలెం, దేవాంగనగర్‌కు చేరుకోగా ఆప్రాంతాల ప్రజలు ఆయన్ను కలిసి సమస్యలను విన్నవించారు. 300 కుటుంభాలము రాళ్లుకొట్టుకొని జీవనం సాగిస్తున్నామని, 60 కుటుంభాలవారము చేనేతమీద ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తమకు జీవనోపాధి కల్పించాలని కోరారు.

సమస్యలు విన్నవించుకొన్న దళితులు

కనిగిరి చెక్‌పోస్టు వద్ద 12వ వార్డు దళితులు నారాలోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. చేతి వృత్తులతో బతుకుతున్నామని, మౌళిక వసతులలేమితో ఇబ్బందిపడుతున్నామని చనిపోయినవారికి అంత్య క్రియలు నిర్వహించుకొనేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన ముస్లింలు

కనిగిరి పట్టణంలోని 10వార్డు ముస్లింలు యువనేత లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. మైనారిటీలకు గతంలో అమలుచేసిన సంక్షేమపథకాలను అమలుచేయాలని, రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఇస్లామిక్ బ్యాక్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, దామచర్ల జనార్ధన్, దామచర్ల సత్య, గూడూరి ఎరిక్షన్‌బాబు, ముత్తుముల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

కనిగిరి శివారు శంఖవరం గ్రామ ప్రజలు యువనేత టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను యువగళం పాదయాత్రలో కలసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 1600 ఓట్లు ఉన్న మా గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపారని ,మా ప్రాంతంలో గ్రానైట్ ఫాక్టరీలు ఉన్నాయని గత నాలుగు సవంత్సరాలుగా ఆర్‌అండ్‌బిరోడ్డు సమస్య గురించి అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు స్కూలుకు వెళ్లాలంటే అవస్ధలు తప్పటంలేదని ,గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ,ఫ్లోరైడ నీటిని తాగి ఆరోగ్య సమస్యలతో ఆల్లాడుతున్నామని వాపోయారు.


లోకేష్‌తో కరచాలనానికి పోటీ పడుతున్న మహిళలు


చిన్నారితో నారా లోకేష్


పాదయాత్రలో పాల్గొన్న విద్యార్థినులు


డాక్టర్ వెంకయ్యను సన్మానిస్తున్న నాయకులు

డాక్టర్ వెంకయ్యకు సత్కారం

ప్రజాశక్తి- శింగరాయకొండ

పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్యను గురువారం ఘనంగా సత్కరించారు. పిడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా డాక్టర్ మాదాసి వెంకయ్య మూడు సంవత్సరాల పాటు పదవి కాలంలో ఉండ అనేక రైతులకు రుణాలు అందజేశారు. అన్ని రకాల రుణాలు ఇవ్వడంలో బ్యాంకును రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపారు. డాక్టర్ మాదాసి వెంకయ్య పదవి కాలం పూర్తయి నూతన చైర్మన్ వస్తున్న నేపథ్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షుడు శీలం రాము, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి, మాజీ ఎంపిటిసి బూర్సు ప్రసాద్, చొప్పర వెంకన్న, రమణారెడ్డి పల్గొన్నారు.

అడుగడుగునా పాదయాత్రకు ఆటంకం

ప్రజాశక్తి-కనిగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అడుగడుగునా ఆటంకాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టిడిపి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్ చర్చిసెంటర్‌లో జరగనున్న భహిరంగ సభను విజయవంతం కాకుండా చేయాలనే తలంపుతో అధికార యంత్రాంగం ద్వారా ఆటంకాలు సృష్టించటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సభకు వచ్చే ప్రజలు, ఆటోలను అడ్డుకొని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల జరిమానాలు విధించటం , ఫ్లెక్సీలు కట్టే అభిమానులను ఇబ్బందులకు గురిచేయటం, కట్టిన ఫ్లెక్సీలను వారిచేతనే చింపించటం దారుణమన్నారు. సభ ఏర్పాట్లును అడ్డు కొనేందుకు ఆర్‌అండ్‌బి అధికారులు ప్రయత్నించటం, పాదయాత్ర, సభలో పాల్గొన కుండా నాయకులపై కేసులు నమోదు చేయటం దుర్మార్గమని వారు విమర్శించారు.

పోలీసులు, ఆర్‌అండ్‌బి అధికారులు యువగళం పాదయాత్ర, బహిరంగ సభ విజయవంతంకాకుండా చేస్తున్న ఆటంకాలను టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ధైర్యంగా ఎదుర్కొని వేలాదిగా తరలివచ్చి యువనాయకుడు నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం నింపేలా సందేశాన్ని ఇచ్చారు. దీంతో టిడిపి శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో పాదయాత్రను విజయవంతం చేసేందుకు ముందుకు కదిలారు.

విఒఎలతో సమీక్ష

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఏరియా కో ఆర్డినేటర్ ఒ.సుధాకర్ ఆధ్వరంలో విఒఎల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ బుక్ కీపింగ్, గ్రేడింగ్, స్త్రీ నిధి ఉన్నతి, సిఐఎఫ్, బ్యాంకు లింకేజీ రుణాలు, ఉమెన్ ఎంటర్ ప్రైజస్, వైఎస్ఆర్ చేయూత, సేల్స్ వర్క్ డన్, ఎఫ్ పీ జి గ్రూపుల ఏర్పాటు గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఐబి.కపారావు, బ్యాంక్ లింకేజీ యాంకర్ పర్సన్ బి.సుబ్బారావు, స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఎల్.నాగ భూషణం, ఎపిఎం కె.గోపాలకష్ణ, సిసిలు పాల్గొన్నారు.

శింగరాయకొండ : వెలుగు కార్యాలయంలో గురువారం విఒలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిపిఎం సునీత, ఏరియా కోఆర్డినేటర్ రాంబాబు, ఐబి గంటా శ్రీనివాసరావు, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసులు, ఎపిఎం జయరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకుల రుణాలు, శ్రీనిధి రుణాలు గురించి సమీక్షించారు.

బిఎల్‌ఒలతో సమావేశం

ప్రజాశక్తి-శింగరాయకొండ

బిఎల్‌ఒలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని తహాశీల్దారు సిహెచ్.ఉష తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దారు మాట్లాడుతూ నెలరోజుల పాటు బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి కొత్తఓట్లను చేర్చాలన్నారు. మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. ఎవరైనా గ్రామాల్లో లేకపోతే వారి ఓట్లను వారు ఉన్నచోటుకి బదిలీ చేయాలన్నారు. ఓట్ల పరిశీలనకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఇఒలు, అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్ర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పొదిలి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేడు మార్కాపురం నియోజకవర్గం లోకి ప్రవేశించనుంది. లోకేష్ రాత్రికి పోతవరం గ్రామంలో బస చేస్తారు. మరుసటి శివాలయం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఈ ఏర్పాట్లను మార్కాపురం మాజీ మాజీ కందుల నారాయణరెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం రూట్ మ్యాప్ గురించి దర్శి డిఎస్‌పి అశోక్ వర్ధన్ రెడ్డితో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి బిసి. జనార్ధన్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుంట్ల అనిల్, టిడిపి రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేష్ యాదవ్, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా, రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, మండల కన్వీనర్ మిగడ ఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి చిన్నబాబు, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ స్వర్ణ గీత తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లకు గురించి చర్చిస్తున్న కందుల నారాయణరెడ్డి

అభివృద్ధి పనులు వేగవంతం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీమకుర్తి

అభివృద్ధి పనులు వేగవంతం నిర్వహించిన మండలాన్ని అగ్రగామిగా నిలవాలని ఎమ్మెల్యే సుధాకరబాబు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లిశివప్రసాదరెడ్డి సహకారంతో మండలం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుం దన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాస రావు, తహశీల్దారు పిన్నిక మధు సూద నరావు,ఎంపిడిఒ రాఘవేంద్రరావు,ఎంపి టిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

ఉచిత వైద్యశిబిరం

గిద్దలూరు : బేస్తవారి పేట మండలం పెద్ద ఓబినేని పల్లి, చిన్న ఓబినేని పల్లిలో గిద్దలూరు కు చెందిన బ్రహ్మానంద రెడ్డి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో గుండె, కంటి మరియు మోకాలు, భుజం, మెడకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి,చెవి,ముక్కు మరియు ఇతర వ్యాధులకు సంబంధించి 116 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. ఈ వైద్యశిబిరాన్ని 766 మంది సద్వినియోగం చేసుకున్నట్లు డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన అందరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించిన మందులు కూడా అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఓబినేనిపల్లి, చిన్న ఓబినేని పల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచితమన్నారు.. మెలిక పెట్టారు...

దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సిడిపిఒ పద్మావతి తెలిపారు. త్రిపురాంతకం మండల పరిధిలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (ఒసి), నడిగడ్డ-1 అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (బీసీ బి), యర్రగొండపాలెంలో ఆయా పోస్టు (బిసిఇ), భట్లువాపల్లి ఆయాపోస్టు (బీసీ డి), అమాను గుడిపాడు-3 ఆయా పోస్టు (ఒసి), పుల్లలచెరువు మండలంలోని రెంటపల్లి-1 ఆయా పోస్టు (బీసీ డి), సి.కొత్తపల్లి ఆయా పోస్టు (ఒసి), ముటుకుల-1 ఆయా పోస్టు(ఒసి), మేడపి ఆయా పోస్టు (ఎస్‌టి), హసనాపురం ఆయా పోస్టు (ఒసి), చెర్లోపల్లి ఆయా పోస్టు (ఒసి)లకు కేటాయించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త పోస్టుకు పదో తరగతి చదివి ఉండాలన్నారు. ఆయా పోస్టుకు ఏడో తరగతి పాసై ఉండాలన్నారు. 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31లోపు సిపిడిఒ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

నేడు మంత్రి సురేష్ పర్యటన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సచివాలయం-4 సచివాలయ పరిధిలోని తిరుమలగిరి కాలనీలో శుక్రవారం (ర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, సచివాలయ కన్వనర్లు ,అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

22న మండల సమావేశం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నాగేశ్వరప్రసాద్ తెలిపారు. ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి మండల పరిధిలోని ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటూ చర్మంలో ఎలాంటి మార్పులు కనిపించినా వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని టంగుటూరు పిహెచ్‌సి వైద్యాధి కారులు డాక్టర్ ప్రసాద్ బాబు, బాలాజీ అశోక్ తెలిపారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు విద్యార్థుల చర్మాన్ని పరిశీలించి మచ్చలు ఉన్న కొందరికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ మూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జి కోటిరెడ్డి, కళాశాల ఆరోగ్య పరిరక్షకులు పి.బ్రహ్మం, సిబ్బంది ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికార సాగుతో నష్టాలు

వేలం మేనేజర్ వేణుగోపాల్

ప్రజాశక్తి-టంగుటూరు

అనధికార సాగుతో పొగాకు రైతులకు నష్టాలే అధికమని, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని వేలం మేనేజర్, పొగాకు బోర్డు ఇన్‌ఛార్జి కార్యదర్శి దివి వేణుగోపాల్ సూచించారు. కొండెపి రోడ్డులోని పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బోర్డు కార్యదర్శి రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రస్తుత పొగాకు మార్కెట్, పంటల నియంత్రణ ఆవశ్యకత, పచ్చిరొట్ట పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రస్తుతం ఉన్న పొగాకు ధరలను చూసి రైతులు భూములను కౌలుకు తీసుకోవడం, బ్యారన్‌లను అధిక ధరలకు లీజులకు తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పశు పోషకుల ఆశలపై నీళ్లు

ప్రజాశక్తి- యర్రగొండపాలెం



పశు బీమా కోసం పోషకులు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. జగనన్న పశు నష్ట పరిహారం పథకంలో బీమా ప్రీమియం రైతుల తరపున ప్రభుత్వమే చెల్లిస్తుంది. సంబంధిత పశువు మరణిస్తే పరిహారం సొమ్ము ఆ రైతు ఖాతాలోకి నేరుగా జమ అవుతుందని రెండేళ్ల క్రితం ప్రజాప్రతినిధులు, అధికారులు ఊదరగొట్టారు. దీంతో పశు పోషకులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం మాట మారుస్తూ ఉచితం కాదని, కొత్తగా అమల్లోకి వచ్చిన వైఎస్ఆర్ పశు బీమా పథకం ప్రకారం ప్రీమియం చెల్లించిన వారికే పరిహారం వర్తిస్తుందంటూ కొత్తగా మెలిక పెట్టారు. దీంతో పాడి రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రీమియం చెల్లించాలనే నిబంధనతో పశుపోషకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ఆర్ పశుబీమా పథకంలో గేదెలు, ఆవులు, గొర్రెలతోపాటు పందులను కూడా చేర్చారు. ఒక్క పశుపోషకుడు గొర్రెలు, మేకలు, పందులను 50 వరకు బీమా చేసుకోవచ్చు. రేషన్ కార్డు కలిగిన రైతులు రూ.30 వేలు విలువ చేసే పశువుకు మూడేళ్ల కాలపరిమితికి రూ.384, రేషన్ కార్డు లేని వారైతే రూ. 960 చెల్లించాలి. గొర్రెలు, మేకలకు ఒకటి, రెండు, మూడేళ్ల బీమా చేయించుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ రేషన్‌కార్డు కలిగిన రైతు గొర్రె లేక మేకకు ఒకటి రెండు మూడేళ్లకు వరుసగా రూ.30, రూ.54, రూ.75 చెల్లించాలి. అధిక ఆదాయం కలిగిన రైతులు రూ.90, రూ.135, రూ.187.50 వంతున ప్రీమియం చెల్లించాలి. చనిపోయిన గొర్రెలు, మేకలకు ఒక్కో దానికి రూ. 6,000 వంతున 50 మేకల వరకు పరిహారం చెల్లిస్తారు.

ట్యాగ్ ఉంటేనే బీమా

- డాక్టర్ ఉడుముల శివారెడ్డి, ప్రభుత్వ పశువైద్యాధికారి



పశువులకు బీమా చేయించే రైతులు వాటికి ట్యాగ్ వేయించుకోవాలని బకాయి లేకుండా ప్రీమియం చెల్లించినప్పుడే బీమా అందుతుంది. బీమా చేయించేందుకు సమీపంలోని ప్రభుత్వ పశు వైద్యుడిని కలిసి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. ట్యాగ్ లేని పశువులకు పరిహారం అందదు.

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని ఐనముక్కల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత గ్రామస్తులు మంత్రి సురేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సురేష్‌కు ఇంటింటికే వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలను తూ.చ తప్పకుండా ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలని, అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ సాయికుమార్, ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి, ఎంపిపి గుమ్మా పద్మజ, జడ్‌పిటిసి లతాబాయి, సర్పంచి చిత్తూరి హారిక, వైసిపి నాయకులు గుమ్మా యల్లేష్, చిట్యాల యోగిరెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, వెన్న కాశి రెడ్డి, దండా గురవరెడ్డి, ఉపసర్పంచి రసూల్, యల్లారెడ్డి, అబ్దుల్ మజీద్, పవన్ కుమార్, చిట్యాల శ్రీనివాసులు, యక్కంటి లింగారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కాపురం : రాష్ట్రంలోని ప్రతి గడపలో సంతోషాన్ని చూడాలన్నదే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే సంక్షేమంలో ఎలాంటి వివక్ష లేకుండా అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలోని 33వ వార్డులో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ముత్తారెడ్డి వెంకటరెడ్డి, వార్డు వైసిపి అధ్యక్షుడు జె.నాగిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత అభివృద్ధికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకరించారన్నారు. వెలిగొండ ప్రాజెక్టు త్వరలో పూర్తవుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సిరాజ్, కొత్త కృష్ణ, అరుణ, రంగలక్ష్మి, దొడ్డ భాగ్యలక్ష్మి, షేక్షావలి, కశ్శెట్టి నగేష్‌కుమార్, బుశెట్టి నాగేశ్వరావు, దూదేకుల ప్రసాద్, కరిముల్లా, షేక్ నాసర్‌వలి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, సయ్యద్ ఆబిదా ఖాశి పాల్గొన్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో మంత్రి సురేష్

31న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31న విజయవాడ నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం డివిజన్ కమిటీ సమావేశం నక్క గంగరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గొర్ల కాపరులకు ఇచ్చిన ఏ ఒక్క హామీలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు నక్క గంగరాజు, సంపతి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రొడ్డా రంగయ్య కమిటీ సభ్యులు రొడ్డా చిన్న రంగయ్య, పిన్నిపోయిన వెంకటేశ్వర్లు, మర్రి వెంకటేశ్వర్లు, పోడతారపు రామయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు

టిడిపి నాయకుల ధన్యవాదాలు

ప్రజాశక్తి-పిసిపల్లి

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేసినందుకు టిడిపి నాయకులు మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పాదయాత్రకు ఎక్కువ మంది హాజరు కావడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. మొదటి రోజు వర్షంలోనూ మూడు కిలో మీటర్ల మేర టిడిపి అభిమానులు, శ్రేణులు భారీ సంఖ్యలో లోకేష్‌తో కలిసి పాదయాత్రలో నడిచినట్లు తెలిపారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు దారిపొడవునా హారతులు పట్టి చంటి పిల్లలతో సహా లోకేష్‌కు జేజేలు పలకడం పట్ల వారు అభినందనలు తెలిపారు. పెదఅలవలపాడు నుంచి బండపాలెం వరకూ భారులు తీరి వేలాది సంఖ్యలో పాదయాత్రలో నడవడం పట్ల వారు ఆనందం వెలిబుచ్చారు. మండలంలో రెండు రోజుల పర్యటన జయప్రదం చేసినందుకు మండల ప్రజలకు, టిడిపి అభిమానులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రుణాలను రికవరీ చేయాలి

పజాశక్తి-యర్రగొండపాలెం

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చిన స్త్రీ నిధి ,ఉన్నతి, రికవరీని వేగవతం చేయాలని డిపిఎం డేవిడ్ తెలిపారు. పుల్లలచెరువులోని ఇందిరా క్రాంతి పథం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ సిఐఎఫ్, విఆర్ఎఫ్ తదితర రుణాలను నెల నెలా క్రమం తప్పకుండా చెల్లించేలా చూడాలన్నారు. కొన్ని గ్రామ సంఘాలలో రుణాల రికవరీ శాతం కొంత ఉందన్నారు. నూరుశాతం రికవరీ సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎసి లక్ష్మీరెడ్డి, ఎపిఎంలు సుబ్రహ్మణ్యం, కృపమ్మ, స్త్రీనిధి మేనేజర్ వీరారెడ్డి, మండల సమాఖ్య అక్షరాలు జ్యోతి, అకౌంటెంట్ మాధవి, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

బిఎల్‌ఒలు ఇంటింటి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి బి. నారదముని, తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని పేర్లు, సదరు డోర్ నెంబర్లలోని ఓటర్లను తనిఖీ చేసి నివాసాలలో ఉన్న వారిని మాత్రమే ఓటర్లుగా పరిగణించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనాథ్, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొద్దాం

- జడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి
- బిల్లులు రాక పనులు చేయాలంటే భయమేస్తోందని సభ్యుల ఆవేదన
- అందరి సమన్వయంతో ముందుకు వెళ్లాలి
- ప్రజాశక్తి కథనంపై సమావేశంలో చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి సభ్యురాలు భవనం శ్రీలక్షీ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితో అభివృద్ధి పనులు చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువద్దామని జడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. ఇంకొల్లు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన ఇంకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన లంచం కొట్టు.. పెన్షన్ పట్టు శీర్షికన ఇంకొల్లు సచివాలయ సిబ్బంది చేతివాటం శీర్షికన వచ్చిన కథనానికి జడ్పిటిసి సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి, ఎంపిపి బండారు అనూష స్పందించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్న సంగతి తమ దృష్టికి వచ్చిందని, సచివాలయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ అధికారుల సమస్యలపై సమావేశంలో చర్చ జరిగింది. సిబ్బంది కొరతతో కొంతమేర ఆలస్యమవుతుందని ఆ శాఖ ఏఇ జాగర్లమూడి రమేష్‌బాబు వివరించారు. జాతీయ ఉపాధిహామీ పనుల విషయంలో ప్రజాప్రతినిధులకు తెలియకుండా పనులు చేస్తున్నారని ఎంపిటిసి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పనులు చేసే సమయంలో తమ దృష్టికి తీసుకు రావాలని దుద్దుకూరు సర్పంచ్ ఎం శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇక నుంచి సమస్య తలెత్తకుండా చూస్తామని ఏపిఓ ఎస్ రేణుక హామీ ఇచ్చారు. త్వరలో నాగార్జున సాగర్ నీరు విడుదల అవుతుందని, సకాలంలో చెరువులను తాగునీటితో పూర్తిగా నింపుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ జ్యోతి కోరారు. దుద్దుకూరు చెరువులో రక్షణ లేకపోవటంతో పశువులు తోలుతున్నారని ఎంపిటిసి సభ్యులు చిగురుపాటి మురళి సభ దృష్టికి తీసుకువచ్చారు. పావులూరు ప్రజలు ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుద్దుకూరుకు వెళ్లాల్సి వస్తుందని, ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పావులూరును చేర్చాలని సర్పంచ్ పులఖండం సుబ్బాయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై 5 సార్లు జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదని అన్నారు. సమావేశానికి ఆర్‌అండ్‌బి అధికారులు రావటం లేదని ఎంపిటిసి సభ్యులు షేక్ హాయేషా బుడే అన్నారు. బడ్జెట్ సమావేశాలు జరిగే సమయంలో తమకు తెలపడం లేదని మండల పరిషత్ ఉపాధ్యక్షులు తూమాటి చలమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నవంబరులో జరిగే బడ్జెట్ సమావేశాలకు తప్పనిసరిగా అందరినీ సమావేశపరుస్తామని ఎంపిడిఓ ఆర్‌ఎం రాజ్యలక్ష్మి తెలిపారు. సమావేశానికి ఎంపిపి బండారు అనూష అధ్యక్షత వహించారు. సమావేశంలో ఇఓపిఆర్‌డి ఏ శ్రీనివాసరావు, ఏపిఎం టి మోహన్‌రావు, ఇంకొల్లు సిడిపిఒ టి ఝాన్సీ, ఎంఇఓలు పివి రాఘవరావు, ఎ శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు లిస్టు తనిఖీ చేయండి

ప్రజాశక్తి-పంగులూరు

ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ లిస్టు తనిఖీ చేయాలని, పంగులూరు మండల తహశీల్దార్ ఐ పద్మావతి సూచించారు. మండల కేంద్రమైన పంగులూరులో గురువారం బిఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, బిఎల్‌ఓలు ప్రతి ఇంటిని తనిఖీ చేసి ఓటర్ లిస్టులో నమోదైన ప్రకారం ఓటర్లు ఉన్నది, లేనిది చూడాలని బిఎల్‌ఓలను ఆదేశించారు. చనిపోయిన వారిని, పెండ్లి చేసుకుని ఇతర ప్రదేశాల్లో నివసిస్తున్న వారిని, ఇంటిలో నివాసం లేని వారిని గుర్తించి, ఓటర్ లిస్ట్ నుంచి తీసివేయాలని తెలియజేశారు. తనిఖీలో ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా, ఓటర్ లిస్ట్‌లను పరిశీలించాలని బిఎల్‌ఓలకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ రామకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్ధారు మల్లిఖార్జునరావు

పారదర్శకంగా ఓటర్ల సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి-రేపల్లె

ఓటర్ల జాబితా సవరణలకై నిర్వహించే సర్వే పారదర్శకంగా ఉండాలని తహశీల్దారు డి మల్లికార్జునరావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా సవరణలపై బీఎల్వోలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి ఆగస్ట్ 21వ తేదీ వరకు నెల రోజులపాటు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఇంటింటికీ పర్యటించి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. మృతుల వివరాలు, డబల్ ఎంట్రీలను గుర్తించి తొలగింపు ప్రక్రియ నిర్వహించాలని కోరారు. 2024 జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల నుంచి ఓటు హక్కు దరఖాస్తును స్వీకరించాలన్నారు. సర్వేలో నిర్వహించాల్సిన అంశాలపై శిక్షణనిచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఎలక్షన్ డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న కరణం వెంకటేష్ బాబు

ప్రజాశక్తి-చీరాల

జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ ఇతర ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందజేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. గురువారం మండలంలోని విజయనగర కాలనీ గ్రామంలోని సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సర్టిఫికెట్లను వెంటనే అందజేస్తామని అన్నారు. ఇది ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు అన్నింటిలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా జతపరచనున్నట్లు పేర్కొన్నారు. కావున ముందస్తు జాగ్రత్తగా ప్రజలు జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకొని వెంటనే ధృవీకరణ పత్రాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజా దెబోరా, ఎంపీడీఓ నేతాజీ, హౌసింగ్ ఎఇ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వాణి, ఆర్బికే చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఎపిఎం సుబ్బారావు, తేళ్ల మోషే, తేళ్ల రాంబాబు, ఉసురుపాటి బుజ్జి, దుడ్డు సుందర్రావు, తేళ్ల లక్ష్మణ, దుడ్డు రాంబాబు, తేళ్ల పవన్, తేళ్ల అంకయ్య, తేళ్ల సుబ్బారావు, తేళ్ల సురేష్, మోహన్ బాబు, ప్రేమ్ బాబు, బుర్ల సాంబశివరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, బుర్ల మురళి, సచివాలయం కన్వీనర్లు, జెఏసి మండల కన్వీనర్లు, వార్డు వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కొల్లూరు :** జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం సచివాలయం-1 సచివాలయం-2లో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పాల్గొని 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయం-1లో 1133, సచివాలయం 2లో 1388 ధ్రువీకరణ పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసినట్లు స్పెషల్ ఆఫీసర్ రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఏ శ్రీనివాసరావు ఎంపీడీవో ఐ సత్యనారాయణ ఈవోపీఆర్డి సిహెచ్ రవిబాబు మండల వైస్ ప్రెసిడెంట్ మురాల రాంబాబు జెడ్‌పిటిసి సభ్యులు సుబ్బారావు, ఆర్‌ఐ బి శివ త్రివేణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **నిజాంపట్నం :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య అన్నారు. గురువారం మండలంలోని పల్లపట్ల గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అయన పాల్గొని పలువురికి వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారని చెప్పారు.లబ్ధిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకొని నూరు శాతం లబ్ధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సురేష్, ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి, సర్పంచ్ రత్న ప్రసాద్, ఎంపీటీసీ నాజర్ ఖాన్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



నగదు పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

సిబ్బందికి నగదు పురస్కారాలు

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో శుద్ధజల కేంద్రాలు పర్చూరు, నూతల పాడు, ఆదిపూడి ప్లాంట్ ల నందు సేవలు అందించుచున్న సిబ్బందికి నగదు పురస్కారాలు అందజేశారు. పురస్కారాలతో పాటు నూతన వస్త్రాలు అందజేశారు. అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సపోర్ట్ అధ్యక్షుడు పోలిశెట్టి చంద్రం, కొల్లా నరేంద్ర కుమార్, పాబోలు ఉదయ్ భాస్కర్, కోటా శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఐలవరంలో నేతన్న నేస్తం లైవ్ షో

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు ప్రారంభించనున్న నేతన్న నేస్తం 5వ విడత సొమ్మును లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్న కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని ఐలవరం గ్రామంలో లైవ్‌షో ద్వారా ప్రజలకు చూపిస్తామని ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలోని శివాలయం సెంటర్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున, బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, రేపల్లె ఆర్‌డిఓ పార్ధసారథి పాల్గొంటారని చెప్పారు.

ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు: ఎంపీ

ప్రజాశక్తి-నిజాంపట్నం

జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గురువారం మండలంలోని అడవులదీవి సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.

గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే ఆహార పదార్థాలు

ప్రజాశక్తి-బాపట్ల

వైఎస్సార్ సంపూర్ణ పోషక పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు అందించే స్పాట్ ఫీడింగ్ (తయారు చేసి అందించే) ఆహార పదార్థాలను ఆగస్టు ఒకటి నుంచి హెూం రేషన్ డెలివరీగా అమలు చేస్తున్నట్లు బాపట్ల సిడిపిఓ శైలజ గురువారం తెలిపారు. ఇప్పటివరకు అంగన్‌వాడీల ద్వారా బాలింతలకు, గర్భిణులకు వండిన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసేవారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్నవారితోపాటు బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ఆహారాన్ని తీసుకొని వెళ్లలేకపోతున్నారని అన్నారు. ఈ విధమైన ఇబ్బందులను అధిగమించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందించే పది రకాల పోషక విలువలు గల ఆహార పదార్థాలను నేరుగా వారి ఇళ్లకే అందించే కార్యక్రమాన్ని ఆగస్టు ఒకటి నుంచి చేపడుతున్నామని అన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక సంచి తయారు చేసిందని అన్నారు. వారికి అందించే ఆహార పదార్థాలను ఆ సంచిలో ఉంచి అందజేస్తారన్నారు. బాపట్ల సిడిపిఓ పరిధిలో 2వేల 363 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. వారికి పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల్లో భాగంగా మూడు కిలోల బియ్యం, కందిపప్పు కిలో, వంటనూనె అరలీటరు, ఐదు లీటర్ల పాలతోపాటు పది రకాల ఆహార పదార్థాలను ప్రతి నెల అందజేస్తారు. నెల మొత్తంగా వారికి 30 కోడిగుడ్లు అందజేయాల్సి ఉంది. ఈ కోడిగుడ్లు పంపిణీ నెలలో మూడు విడతలు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. దీనిపై అంగన్‌వాడీలకు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.



బాపట్ల సిడిపిఓ బి శైలజ



ప్రత్యేకంగా తయారు చేసిన సంచి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్ధారు మల్లిఖార్జునరావు

బాలికలకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లు మండలంలోని పూసపాడు ఎస్‌కేపీవీఎస్ హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 8 మంది బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఒక్కొక్క సైకిల్ విలువ రూ.7 వేలు ఉంటుంది. ఇందుకు గాను దాతలు రూ.2,000 తమ వాటా కింద ఇవ్వవలసి ఉంటుంది. ఈ సొమ్మును పాఠశాల పూర్వ విద్యార్థులు, పూసపాడుకు చెందిన యార్లగడ్డ రామకృష్ణ, బోడావుల రఘురాం సోదరుడు బోడావుల రామకృష్ణ జ్ఞాపకార్థం ఒక్కొక్కరు రూ.8000 చొప్పున మొత్తం 16,000 ఆర్థిక సహకారం అందజేశారు. దాతల యొక్క సేవాగుణానికి పాఠశాల హెడ్‌మాస్టర్ కే శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. దాతల నుంచి సహాయం పొందేందుకు పాఠశాల రికార్డు అసిస్టెంట్ ప్రభాకర్‌రావు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బృందం ఉపాధ్యాయ బృందం సత్యనారాయణ, సాగర్, సాయి, సుబ్బారావు, వేణు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎల దీక్షలు


దోర్నాలలో దీక్షల్లో కూర్చున్న విఆర్ఎలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

విఆర్ఎల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణ కంటి యాకోబు డిమాండ్ చేశారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ విఆర్ఎలకు పేస్కేల్ వర్తింపజేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు జెడ్డా ఆశీర్వాదం, సెక్రెటరీ వెంకట్ నారాయణ, కోశాధికారి దూదేకుల పెద్ద కాశయ్య, తోకల వెంకటేశ్వర్లు, కాసిం, దర్శనం పోలయ్య ,ఓదెల ప్రభుదాసు, ఎలకపాటి రవి, దర్శనం ఏలియా, కటికల దేవయ్య ,పుప్పాల చెన్నయ్య, గంపల గురవయ్య, భూమన్ నాగేశ్వరరావు, ఆవుల పద్మ, అరుణ పాల్గొన్నారు.

వెలిగండ్ల: విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు రాయల మాలకొండయ్య కోరారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. నాలుగేళ్లుగా విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ఫలితం లేదన్నారు. అనంతరం తహశీల్దారు చిలకల నాగార్జున్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి షేక్ మాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, అంజయ్య, కోటయ్య, దేవమ్మ, ప్రకాశం పాల్గొన్నారు.

అయ్యా.. నేను బతికే ఉన్నా..

ఓ యువతి ఆవేదన

ప్రజాశక్తి- కంభం రూరల్

తాను బతికే ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో చంపేశారని మండల పరిధిలోని కందులాపురానికి చెందిన వెంకట శ్రావణి అనే యువతి వాపోతోంది. ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన తనకు కంభం మండలం కందులాపురానికి చెందిన పింబర్ల తేజతో ఐదేళ్ల క్రితం వివాహమైనట్లు తెలిపింది. పుట్టినింటి రేషన్‌కార్డులో తన పేరును తొలగించి భర్త కార్డులో చేర్చుకొనేందుకు దరఖాస్తు చేసుకున్నానని, ఆన్‌లైన్‌లో తాను మృతి చెందినట్లుగా నమోదైనట్లుగా కందులాపురం సచివాలయ సిబ్బంది తెలిపారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేంటని కందులాపేరం సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే కరేడు గ్రామ సచివాలయంలో సరి చేసుకోవాలని చెప్పారన్నారు. కరేడు గ్రామ సచివాలయం సిబ్బందిని అడిగితే తమ తప్పేమీ లేదని కందులాపురం సచివాలయంలోనే సరి చేసుకోవాలని చెబుతున్నట్లు ఆమె వాపోయారు. ఈ విషయం గురించి కంభం తహశీల్దారు దష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రేషన్ కార్డులో తన పేరు నమోదు కానందున గత నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నానని శ్రావణి వాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తన పేరును రేషన్ కార్డులో నమోదు చేయాలని కోరుతోంది.


శ్రావణి


వెంకయ్యను సత్కరిస్తున్న దృశ్యం

నాలుగేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

- డాక్టర్ మాదాసి వెంకయ్య - ఘనంగా అభినందన సభ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆరుగాలం శ్రమించి రైతులకు సేవలందించటం గొప్ప వరమని, నాలుగేళ్ల పాలన సంతృప్తిని ఇచ్చిందని పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక పిడిసిసి బ్యాంకు సమావేశ మందిరంలో గురువారం మాదాసి వెంకయ్య అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డిజిఎం కుంభా రాఘవయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో డిజిఎం కుంభా రాఘవయ్య, డైరెక్టర్ బాలగురవయ్య, బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ప్రసంగించారు. అనంతరం డాక్టర్ మాదాసి వెంకయ్యను బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

రిలే దీక్షల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్


రిలే దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్

ప్రజాశక్తి-పొదిలి

మున్సిపల్ కార్మికులను ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ మస్టర్ పాయింట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను రమేష్ ప్రారంభించి.. మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీకి జగన్మోహన్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 2 లక్షలా 50 వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉండగా పదివేల మందినే రెగ్యులర్ చేస్తామని ప్రకటించడం వారిని మోసగించడమే అన్నారు. నిరాహారదీక్షలలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర పంచాయతీ అధ్యక్ష కార్యదర్శులు జి.నాగులు, డి.సుబ్బయ్య, కెవి.నరసింహం, కోటేశ్వరావు, పి.నాగేంద్రం, లీలమ్మ, ఆర్.చిన్నమ్మి, సిహెచ్.అంజమ్మ, ఎం.శాంతమ్మ, ప్రభావతి, డి.పోలేరమ్మ, బి.విజయమ్మ, వై.స్వరూప పాల్గొన్నారు.

కనిగిరి: పాదయాత్ర సమయంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో వైసిపి ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జిల్లా కార్యదర్శి పిసి.కేశవరావు విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులు రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. రిలే దీక్షల్లో జి.ఈశ్వరమ్మ, జె.తిరుపతమ్మ, ఎ.ఆదిలక్ష్మి, కెవి.రమాదేవి, ఎ.గురవమ్మ, సిహెచ్.సావిత్రి, సిహెచ్.నరసమ్మ, ఆర్.రోజమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు ఖాదర్‌వలి, శేషయ్య, ఎలీషా, గరటయ్య, ఆనంద్, వెంకటరెడ్డి, జేమ్స్, మార్క్,ఆర్ నరసింహులు, బాలస్వామి పాల్గొన్నారు.

చీమకుర్తి: మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు అత్యాల యోహాన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అల్లడి కోటేశ్వరరావు, పిచ్చయ్య, ఎం రమణ, అరుణ, కోటేశ్వరి, చిరంజీవి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాయలం ఎదుట కార్మికులు గురువారం దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. నాగయ్య , ఏసుబాబు తెలిపారు. ఈ దీక్షలకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు అధ్యక్షులు జి.పద్మావతి కార్మికులకు పూలమాల వేసి దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో సిఐటియు గిద్దలూరు కార్యదర్శి బి నరసింహ, నాయకులు థామస్ , బి.శ్రీను, మురళి, డి.వెంకటరావు, మార్తమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.


ప్రదర్శనలో రైతుకూలీలు

ఒంగోలులో రైతు కూలీల ప్రదర్శన

ముగిసిన మహాసభలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రైతు కూలీ సంఘం ప్రకాశం జిల్లా మహాసభలు గురువారం ముగిశాయి. జిల్లా మహాసభలలో భాగంగా ప్రారంభ సభ అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో గత మహాసభల నుండి ఇప్పటి వరకు జరిగిన సంఘం కార్యకలాపాలను సమీక్షించుకుని, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకున్నారు. తరువాత వేజండ్ల రామారావు అధ్యక్షులుగా, సిరిగిరి లలిత కుమారి కార్యదర్శిగా, పరిటాల కోటేశ్వరరావు సహాయ కార్యదర్శిగా, వాటంబేటి శ్రీరాములు కోశాధికారిగా మరో పన్నెండు మంది సభ్యులతో కొత్త జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. మహాసభల అనంతరం ఒంగోలు వేమూరి కళ్యాణ మండపం నుండి ఏనుగు చెట్టు, అంబేద్కర్ విగ్రహం, చర్చి సెంటర్, నెల్లూర్ బస్టాండ్, రత్నమహల్ మీదుగా కలెక్టరేట్ వరకు జరిగిన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝూన్సీ, రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి శిరిగిరి లలితకుమారి, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు డివిఎన్ స్వామి, ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు కత్తి పేరయ్య పాల్గొన్నారు.

నవీన్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నవీన్‌పై దాడి చేసి, మూత్రం పోసిన దుండగులను తక్షణం అరెస్టు చేసి శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఒంగోలు నగర నాయకులు ఏ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం కమిషన్ సభ్యులు వడిత్యా. శంకర నాయక్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో గిరిజన యువకుడిపై దాడి చేసి మూత్రం పోయడం చాలా దుర్మార్గమైన చర్యని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా నేటికీ సభ్య సమాజంలో విచక్షణ మరచి మూత్ర విసర్జన దాడులు లాంటివి జరుగుతుండటం బాధాకరమని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. దాడి చేసిన వారిని శిక్షించాలని, బాధితుడికి న్యాయం చేయాలని ఎస్‌టి కమిషన్ సభ్యులను కోరారు.

వెలిగండ్ల హైస్కూల్‌కు 'బూచేపల్లి' విరాళం


విరాళం అందజేస్తున్న జడ్పీటీసీ తిరుపతిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల హైస్కూల్‌కు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.50 వేల విరాళం గురువారం అందజేశారు. గతంలో నిర్వహించిన వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవిర్భావ దినోత్సవానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. ఆ సమయంలో పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల విద్యుత్ బకాయిలు రూ.50 వేల వరకూ ఉన్నాయని, జడ్‌పి నిధుల ద్వారా అందజేయాలని కోరారు. వీలైతే జడ్‌పి నిధుల ద్వారా, లేదంటే తమ సొంత ట్రస్ట్ ట్రస్ట్ ద్వారా అందిస్తామని వెంకాయమ్మ ఆ సమయంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ట్రస్ట్ ద్వారా వెలిగండ్ల జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి చేతుల మీదగా రూ.50 వేల నగదును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్‌లో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వెలిగండ్ల జడ్‌పిటిసిగా తాను వీలైతే జడ్‌పి నిధుల ద్వారా లేదంటే తమ సొంత నిధులైనా వెచ్చించి.. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, వైసిపి మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, మాజీ కన్వీనర్ చిలకల వెంకటేశ్వర్‌రెడ్డి, వెలిగండ్ల సర్పంచి తాతపూడి సురేష్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరామయ్య, వైసిపి నాయకులు నాగూర్ యాదవ్, ఎలిక నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.